# అలీఫ్ బే తే

## మా నాయినమ్మకి గోరి కడితే

గౌస్‌జాన్ వెనకింట్లోకి జెడ్పి ఉర్దయివోరు బాడిక్కి దిగినాడని తెలిసినాక మా కసాబ్‌గల్లీ పిలకాయలకి కాళ్లూ చేతులూ ఆడలా. అల్మాస్ వాళ్లింటికాడ కువ్వబోసిన యిసకలో ఎట్టా ఆడుకుంటున్నామో అట్టే కూచునేసి పోయినాం- అది తెలిసి.

'యిప్పుడే ఐవోరొచ్చి టైరుబండ్లో సామాన్లు దించతా వుంటే చూసేసొస్తున్నా సామీ. రేపట్నించి ఆణ్ణే పర్‌వేట్ చెప్పించుకోవాలంట. ఉర్దూ కూడా నేర్చుకోవాలంట. మా అమ్మ చెప్పింది' అన్నాడు గౌస్‌జాన్ కొడుకు సందాని- నిండా నీళ్లు దిగిపోయిన మొకంతో. పోయిపోయి పక్కింట్లో పర్‌వేట్ పీడ దాపురించిందేమిరా అని వాడికి బలే అదురుగా వుంది.

ఉర్దూ మాటెత్తేసరికి మా షమ్మీ కూడా అదిరిపోయింది.

'యిప్పుడెట్టరా? మా అమ్మ కూడా పంపిస్తుందేమో పీడ' అనింది బితుకు బితుకుమంటా. మా నాయినమ్మ పుణ్యమా అని ఆయమ్మికి ఉర్దూ పాఠమంటే హడలు.

షమ్మీది మా ఎదురిల్లు. వాళ్ల నాయిన లారీడ్రయివరు అహ్మదుబాష. ఆయమ్మీ పొద్దుగూకులా నాతో ఆడుకునేదానికి మా యింటికొస్తా వుండేసరికి మా నాయినమ్మ సైగ్గా దాని మీద కన్నేసింది.

కూరలోకి అల్లం ముక్క అడగడానికి వచ్చిన వాళ్లమ్మ ఖుర్షీద్‌బీని నిలేసి- 'మ్మే ఖుర్షీదా! ఆడపిల్లకి నాలుగు ఉర్దూ ముక్కలైనా చెప్పీకుండా నీ కూతురిని యీ దోవన పెంచతా వుండావే. నీకేమైనా బుద్ధుందంటమే. రేపది (పెళ్లయి) వెళ్లిన చోట యీ సంగతి తెలిసిందంటే అందరూ ముక్కన వేలేసుకోరా? ఉర్దూ రానందుకు నిలబెట్టి ఊయరా?' అని బెదరగొట్టి లటక్కన షమ్మీనేసుకుంది మా నాయినమ్మ.

ఆనేక మా నాయినకు డావేసింది.

''రే అబయా! నీకూ యీ మనిషికి (మా అమ్మను చూపిస్తా) కోస్తే ఒక్క ముక్కయినా ఉర్దూ రాదు కదా, పిలకాయలని కూడా మీలాగనే అణాకీ బేడకీ పనికి రాకుండా తయారు

చేస్తారా నాయినా! యిప్పుటికే యింట్లో ఒక నమాజులా. ఒక ఖురానులా. 'ఫాతేహా' చేయడమైనా నేర్చుకోమ్మా తల్లా అంటే యీ మనిషికి అదీ రాకపాయా. ఉర్దూ అరబ్బీలు నాతోనే ఆకరయి పోయేటట్టున్నాయి యీ యింట్లో' అని యాక్షను చేసి మా అన్ననూ నన్నూ చేజిక్కించుకునింది.

యింక చూడూ.

సాయింత్రం మగ్‌రిబ్ నమాజయిపోయినాక మా ముగ్గురినీ మా నాయినమ్మ పట్టుకోవడం- తలకాయల మీద చేతిగుడ్డో టోపీలో పరవడం- 'అలీఫ్ బే తే'లు చెప్పడం- వాటిని చూడకుండా రాసేదాక వేళ్లు మెలేసి చుమ్టాలు పెట్టడం... యిదే దరువు. (చుమ్టా అంటే మిఠాయనుకునేరు. తొడపాశం సామీ).

షమ్మీ అసలికే మొద్దు ముండ. అలీఫ్, బే, తేలు రాక... మా నాయినమ్మ పెట్టే చుమ్టాలను సయించలాక కింద- తొడ ఎర్రగా కందిపోతా వుంటే పైన- కళ్ల నిండుగా నీళ్లు పెట్టుకునేది.



ఆ కడుపుమంట తీర్చుకునే దానికి మేమందరం ఆడుకుంటున్నప్పుడల్లా 'అలీఫ్ బే తే... మీ నాయినమ్మకి గోరి కడితే' అని పాడతా వుండేది.

నాకేమైనా తక్కువ కడుపుమంట వుంటేగదా. నేను కూడా అందుకునేది- 'అలీఫ్ బే తే... హమారి దాదీకి ఖబర్ బేతే' అని.

కొన్నాళ్లకి యిస్కూల్లో అర్థం గాని ఇంగిలీషు- తెలుగు బాద, ఇంట్లో మా నాయినమ్మ ఉర్దూ బాద ఎక్కవయిపోయే సరికి యింకిట్ల కాదని వాళ్లమ్మకు ఏమి చెప్పుకునిందో ఏమో ముంగమూరులోని వాళ్లక్కింటికి ఉడాయించేసింది షమ్మీ. పది రోజులు




రానేలా. నేను కూడా సాయింత్రమైతే చాలు యూనిట్ టెస్టులు వుండాయని చెప్పి ఇంగిలీషు పుస్తకం ముందగ పెట్టుకొని 'రానుయ్య- ద కాబలర్' చదవతా కూచునేవాణ్ణి. మా అన్నయితే 'పోపోమ్మే... యీ తలకాయ నెప్పి ఉర్దూ ఎవరు నేర్చుకుంటారా?' అని పూర్తిగా అడ్డం తిరుక్కునేసినాడు.

మా నాయినమ్మ విసిగిపోయి 'పో పోండిరా కాఫిర్ నాయాళ్లారా. మీ ఖర్మాన మీరే పోతారు' అని వదిలేసింది మమ్మల్ని.

అట్టా బతికి బయటపడిన మేము మళ్లా ఉర్దయివోరు గండాన్ని ఎట్టా తప్పించుకోవాల్రా సామీ అని ప్లానులో పడ్డాం.

'యీ ఐవోరు బెత్తం పట్టుకుంటే వొదలడంట సామీ. యీ సంగత్తెలిసే మా అన్న ఆరులో ఉర్దూకు బదులుగా తెలుగు తీసుకున్నాడంట' అని యింకాస్త దడిపించినాడు యూసఫ్గాడు.

ఆ దెబ్బకి యింకిప్పటికిప్పుడు ప్లానేయక తప్పదని అర్థమైపోయింది అందరికి.

'థథ్థాయ్... ఐడియా' అన్నాడు గౌస్‌జాన్ కొడుకు సందాని.

'ఏందిరా... ఏందిరా' అని అడిగినాము అందరం.

'జాఫర్ ఐవోరు. విజ్‌డమ్ టుటోరియల్స్' అన్నాడు చిటికేస్తా.

అందరం సప్పంగా సల్లబడిపోయినాం.

'ఏడ్చినాపులే. ఆ పర్‌వేట్‌లో బాగా చెప్పరనికదా సామీ మనం చేరనిది. అదీగాక ఆడ పది రూపాయలు నాయినా ఫీజు' అన్నాడు యూసఫ్.

'ఫీజు పెచ్చయితే ఏమిరా? కొట్టకుండా చెప్తారంట. మధ్యలో ఎగనూకినా ఏమీ అనరంట' అన్నాడు సందాని.

'అవునురా. ఉర్దయివోరు పీడకన్నా విజ్‌డమే మేలు' అని సందానీకి సపోర్టు మాట్లాడింది షమ్మీ.

షమ్మీ చెబితే కాదంటానా? 'సరే అయితే' అన్నాను.

వెంటనే అందరం చెడ్డీలకంటిన యిసకను విదిలించుకుంటా లేచి, చదువంటే బలే బయమూ బక్తీ వున్న పిలకాయల్లాగా మా యిళ్లల్లో యాక్షన్లు చేసి, ఆగమేగాల మీద జాఫరయివోరి పర్‌వేట్‌లో చేరిపోయినాం. ఉర్దూ జోలికే పోని ఆ పనికిమాలిన పర్‌వేట్‌లో చేరినాకగానీ మా అందరికీ ఉర్దూ పీడ శాశ్వితంగా విరగడైపోలా.

ఆ తర్వాత- యిప్పటి వరకూ కూడా ఉర్దూ నేర్చుకోలేదనిగానీ, అరబీ రాదనిగానీ, తెలుగులో తప్పితే ఆ బాషల్లోని ఖురానుని తాకనుకూడా తాకలేదనిగానీ నేను యింతంటే యింత కూడా బాద పళ్లా.

కానీ యిన్నేళ్ల తరువాత, హైదరాబాద్ ప్రెస్‌క్లబ్బుల్లో ఇరానీ హోటళ్లలో పరిచయమయ్యి చాయ్‌లు తాగతా సిగరెట్లు ఊదుకుంటా కవిత్వాలు చెప్పే షోదానాయాళ్లంతా 'నీకు మగ్దూము తెలుసా? ఫయాజ్ అహ్మద్ ఫయాజు తెలుసా? జీలానీ బానో తెలుసా? సిరాజుద్దీన్ మౌలా తెలుసా? మాకెట్టా ఆ బాగ్యం లేదు. సాయిబై పుట్టీ కూడా ఉర్దూలో ఏమి కవిత్వం మిస్సయిపోయినావు బాస్' అంటా జాలిపడతా వుంటే ఆనాడు బతిమాలో బామాలో తేనెలాంటి ఆ బాషని నేర్పించనందుకు మా నాయినమ్మకు నిజ్జంగానే గోరి కట్టాలనిపించింది.